సాయంత్రం అయిదయింది—

ఆఫీసు వదిలేశారు।

ఫైళ్ళను ప్రక్కకుతోసి రంగారావు లేచి నిలబడ్డాడు. అప్పటికే ఆఫీసు దాదాపు ఖాళీ అయింది. ప్యూను కిటికీలు మూసేస్తున్నాడు.

రంగారావు బక్కపలచటి మనిషి. సీటులోనుంచి లేచేటప్పుడు, టేబిలుమీద చేయానించి మరీలేస్తాడు. రంగారావుకున్న నూటఒక్క సమస్యల్లో తన ఆరోగ్యాన్ని గురించిన సమస్య నూట

("అందాయి!")

"ఇపుడు తానీ రోడ్డు వెంబడే తిన్నగా ఇంటికిపోతే ఏమవుతుంది?"

(ఏమవుతుంది? పిచ్చి ప్రశ్న! అప్పులవాళ్ళు ఎదురవుతారు!")

"ఉహుఁ....తాను ప్రక్క దారుల గుండా పోతేనో!"

("ఓరి వెర్రివాడా! పిట్ట గూటికి చేరుతుందని నమ్మకం ఉన్న కాలనాగు కొమ్మలవెంట ప్రాకుతూ కాలాన్ని వృధా చేయదు....గూటి దగ్గిరే కాచుకూర్చుం

● రుక్మిణి

# చందమామ రావే

ఒకటవది।

రంగారావు బయటకువచ్చాడు.

రోడ్డంతా సందడిగా, కోలాహలంగా ఉంది. హడావుడి బసుస్టాపులో కాలేజీ స్టూడెంట్సు సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

రంగారావు అలసిపోయాడు. తన చేతకానితనంమీద చాలీచాలని జీతంమీద, రోతపుట్టించే జీవితంమీద, తన అనారోగ్యంమీద, ఆలోచించీ, ఆలోచించీ అలిసిపోయాడు! రంగారావు రోడ్డు వెంబడి నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

"ఇపుడు తనకు జీతాలందాయా? టుంది!")

"అవునూ...తా నివ్వాల్సిన బాకీ ఈ ఒక్కనెల ఇవ్వకపోతే ఇల్లుగలాయనా కిరాణా కొట్టువాడూ....మందుల దుకాణంవాడూ....వడ్డీకిచ్చే కాబూలీవాడూ ... యీ క్షణంలోనే దివాళా తీసి భిక్షగాళ్ళయిపోతారా?"

("ఫూల్! వాళ్ళేం తిండికి చావరు. రేపటినుండి నువ్వే అల్లల్లాడి చస్తావు. అయినా ఈ నెల అప్పులన్నీ కట్టకపోతే ఆ డబ్బుతో నువ్వేం చేస్తావ్?")

"అమ్మో— అలా అడిగితే తానేం సమాధానం చెప్పేది? తనకున్న నూట

ఒక్క కోరికల్లో కొన్నయినా తీర్చు కోడూ! ఏవంటే ఏం చెప్పేది? ఎలా చెప్పేది! అమ్మో! ఇద్దరు పిల్లలకు చొక్కాలు కుట్టించి, చినిగినవి—మాసికలు పడినవి మూలకు విసిరేసి వాళ్ళు నవ్వుతూంటే చూస్తూ నిలబడతాడు—బలహీనంగా — విల్లిలా వంగిపోయిన పెళ్ళానికి కావలసినవి కొనుక్కోమని చేతిలో డబ్బులు పడేసి, అది ఆశ్చర్యంగా తనవైపుచూస్తూ నిటారుగా నుంచుంటే తాను నవ్వుతాడు! ఆ ఒక్కరాత్రి కమ్మని కలలు కంటూ నిద్రపోతాడు ......ఆల్ రైట్! ఈసారి అప్పులవాళ్ళు అడిగితే తాను తన నిర్ణయాన్ని చెబుతాడు! ఇడియట్ .. కిరాణం కొట్టు మల్లేశం రాక్షసుడు......వాడిమెడ మీద చెయివేసి రోడ్డుమీదకు తోయాలి! ఇంటి యజమాని గోపాల్రావు అద్దె బకాయీ అడిగితే నిర్లక్ష్యంగా నవ్వుతాడు ఐ డోంట్ కేర్ దట్ నట్! టర్... ఇంతకాలం తాను ఈదిన సమస్యల సముద్రానికిక గుడ్ బై. బై బై ... తానిక ఈదలేడు!!

ఇదీసార్! ఈ నిశ్చయంతో రంగారావు మెయిన్ రోడ్డు మలుపు తిరిగి సందులోకి ప్రవేశించి, అప్పుడే మూయబోతున్న డా॥ కృష్ణమూర్తి పాథాలజీ లోకి అడుగుపెట్టాడు. !

ఇంటికి పోతున్న కాంపౌండరు ఆగి రంగారావును చూసి చిన్నగా నవ్వాడు. "మీ రిపోర్టు తయారుగా ఉంది....డాక్టరుగారు లోపలున్నారు....అటు :"

రంగారావు నిర్లక్ష్యంగా నవ్వి ఫీజు..?

"పదిహేను"

నోట్ల బొత్తిలో నుండి తీసి, అతని కందించి, స్వింగ్ డోర్స్ తెరుచుకుని లోపలికి అడుగు పెట్టాడు.ఆ గది చల్లగా ఉంది. డాక్టరు తెల్లగా .... బొద్దుగా వున్నాడు!


"రండి .. కూర్చోండి. జస్ట్ అయాం రిఫరింగ్ యువర్ రిపోర్టు! ప్లీజ్ బీ సీటెడ్!!"

రంగారావు డాక్టరు కెదురుగా కుర్చీలో హొందాగా కూర్చున్నాడు! డాక్టరు కళ్ళు పైకెత్తి రంగారావు కేసి నిదానంగా చూశాడు. ఆ చూపు రంగారావుకు దుస్సహంగా, భరింపరానిదిగా ఆ క్షణంలో తోచింది!

"చెప్పండి!"

"నేను చెప్పే విషయాలు మీరు జాగ్రత్తగా వినండి!" అలాంటి సంఘటనలు ఎన్నో ఎదుర్కొన్న డాక్టరు కూడా క్షణంఆగాడు."అయాం సస్పెక్టింగ్"లుకేమియా"-డోంట్ అప్ సెట్! మీ డబ్ల్యు. బి. సి. చూశారా .... ఒక్కసారిగా తగ్గిపోయింది. మీ వెయిట్ చాలా తగ్గిపోయింది నార్మల్ గా మీ డబ్ల్యు. బి. సి. ఆరువేల నుండి పదివేల వరకుండాలి! అయితేఇటీజ్ డిక్రీజ్డ్ టు త్రీ థౌజండ్.. బ్లడ్ కాన్సర్...."

రంగారావు మనసు ఆలోచించే స్థితిలో లేదు....ఓ క్షణం మొద్దుబారిపోయింది. వెంటనే రంగారావుకు వెయ్యి ఏనుగుల బలం..ఒక లక్ష అక్షౌహిణీలఆశ్వికశక్తివచ్చినట్లనిపించింది....పూర్ ఫెలో .... తనకు బ్లడ్ కాన్సర్ ... హహ్హహ ... గట్టిగా నవ్వుదామనుకుని బలవంతంగా ఉగ్గబట్టుకున్నాడు! జీవితంలో ఇవాళ మరపు




రాని రోజు .... జీవన సమరంలో తనకు విజయం సిద్ధించిన రోజు .... తానను కున్న మొదటి ఆలోచన ఈ రూపంలో సఫలీకృతం కావడం తనకు విజయం। జయం।।

....అయితే కొన్ని అవకాశాలు లేక పోలేదు...మీరు చదువుకున్న వారు — ఎక్కువగా ఏమీ చెప్పలేను.... అయాం వెరీ సారీ।"

డాక్టరు దగ్గిర సెలవు తీసుకుని రోడ్డు మీదకు వచ్చాడు రంగారావు।

ఆకాశం నిర్మలంగా ఉంది — అపుడే వెలిగిన వీధి లైట్లు ఆహ్లాద కరంగా ఉన్నాయి। చల్లటిగాలి ... ప్రక్కన నడుస్తున్న చాలా మందిని పిలిచి గట్టిగా నవ్వి, కరచాలనంచేసి, వాళ్ళ కేదో చెబుదామను కున్నాడు .... ఇపుడు తానెవ్వరికి భయపడాల్సిన అవసరం లేదు.... తనకేం భయం।।

చీకటి పడుతుంది —

రంగారావు ఆగి, పాతిక మూరల మల్లెపూలు కొన్నాడు.. దవనంకొన్నాడు. ప్రక్కనున్న రెడీమేడ్ షాపులోకి దూరి, నాలుగు చొక్కాలు ఖరీదైనవికొన్నాడు.. ఇంకేం చేయాలో ...ఇంకేం ఖరీదు చేయాలో తోచక, రోడ్డుమీదకువచ్చి, ఎదురుగా ఉన్న స్వీట్స్ హోటల్ లోకి అడుగుపెట్టాడు। ఒక కిలో స్వీట్సుపాక్ చేయించాడు కాఫీ త్రాగి బయటకువచ్చి "డన్‌హిల్" సిగరెట్టు వెలిగించాడు.... హాయ్....హాయ్.... ।।

("ఓయ్ రంగారావు। నువ్వెంత అదృష్టవంతుడువోయ్...ఇప్పుడేం చేస్తావ్ మామూలుగా రోడ్డుమీదనుండి ఇంట్లోకి పోతావా? వెనక గుమ్మం తెరుచుకుని దొడ్లోగుండా దొంగలా దూరతావా? నో....నో .. నో ....తనకేం ఖర్మ। రాచ మార్గమే తన మార్గం।)

అదుగో మల్లేశం దుకాణం। చీకటిపడ్డా జనం రద్దీ తగ్గలేదు....మల్లేశం కేకేశాడు....రంగారావు వెనక్కి తిరిగాడు

"ఏమిటి?"

ముందు మల్లేశం విస్తుపోయి, తర్వాత తీవ్రంగా చూశాడు....ఆ చూపు దుస్స హంగా ఉంది....ఎవరూ ఏమీ చెయక పోతే రంగావును నమిలి మింగేస్తానన్న భావన వుంది। రంగారావు మల్లేశం భుజం మీద చెయి వేశాడు।

"పిచ్చివాడా। నీడబ్బా .. ఓయిదబ్బా। నేనీ్నకు ఇవ్వాల్సిన బాకీ ఇవ్వకపోతే నువ్వేం చేస్తావ్? నన్ను చంపుతావా? నరుకుతావా? నన్ను చంపలేవు .... నరక లేవు....అలా అని నువు సంపాదించిన లక్షల ఆస్తి తరిగిపోయి నడివీధిలో బికా రిలా బిచ్చమెత్తలేవు। అయినా ఒరేయ్। ఎందుకురా డబ్బంటే అంత ఆపేక్ష నీకు పోనీ... దాన్నే మయినా రంగరించుకుని తాగుతావా? తాగలేవుగద! పోనీ మూట కట్టుకుని వెంట తీసుకుపోతావా? పోలేవు గదా। మరెందుకురా డబ్బంటేఇంత"ఇది" నీకు . చాలు....ఈ నెల నీకు డబ్బివ్వను అసలు ఏ నెలా ఇవ్వనుగాక ఇవ్వను। పోలీసుల్ని పిలుస్తావా? టేక్ కేర్। నాకెవ ళ్ళన్నా భయంలేదు....అదుగో....నువ్వ న్నావు. నీ కింత డబ్బుంది....నాలాంటి వాళ్ళనుఆదుకో। ఆ పుణ్యమైనా మిగులు తుంది। నీ రాక్షసావతారాన్ని చాలించ వోయ్....ఒరేయ్....యీ రాత్రంతా నేను చెప్పినమాటలు బాగా ఆలోచించుకో నీకు తట్టకపోతే నీ పెళ్ళాన్ని లేపి సలహా అడుగు. హహహ్హా।"

మల్లేశాన్ని విసురుగా వెనక్కి తోసి, చంకలో నుండి జారిపోతున్న ప్యాకేజీ ల ను ఎగదోసుకుని, హు షా రు గా ముందుకు కదిలాడు రంగారావు।

చీకటి చిక్కబడింది—

రంగారావు అడుగులు చాలా వేగంగా పడుతున్నాయి .. అదుగో తన యిల్లు.... తన జీవితంలో సగం....తన రెండు రత్నాలు తన కోసం ఎదురుచూస్తుం టాయి....పిచ్చినాన్నలు। ఈ నెల చివరి భాగం మీరు పస్తులుండాల్సిన పన్లేదు .. "అదిలేదు....ఇదిలేద''ని ఆ రా ట ప డి దిక్కుమొహాలు వేయాల్సిన పని అంత కన్నా లేదు। హహ్హహ్హా....

"ఎవరదీ?"

అది తమాషా పలకరింపు....గోపా ్రలావు తన అత్తగారి ఆస్తిమీద కట్టించిన అయిదు పోర్షన్లను అద్దెకిచ్చి, బకాయి పడ్డవారిని అడగడానికి ప్రత్యేకంగా నేర్చుకున్న చిత్రమైన పలకరింపు।

"నేనే। రంగారావుని।"

గోపాల్రావుని రంగారావు మాట్లాడ నీయలేదు...ప్రక్కనున్న కుర్చీ లాక్కుని సరసన కూర్చున్నాడు। జేబులో నుండి "డన్‌హిల్" పెట్టె తీసి ఒక సిగరెటు వెలిగించి గోపాల్రావుగారికో సిగరెటు "ఆఫర్" చేశాడు.

"చూడు గోపాల్రావుగారూ। నీకు కొన్నేండ్ల అద్దె బకాయీ పడి ఇవ్వక పోతే ఏమవుతుంది?"

గోపాల్రావు బిత్తరపోయాడు.

"టేక్ కేర్। నేను ఇవ్వబోవడం లేదు అలా అని ఇల్లు ఖాళీచేయబోవ డంలేదు. 'దున్నేవాడిదే భూమి....ఉండే వాడిదే ఇల్లు....' నువ్వంటున్న ఒక్క యిల్లు నీకు చాలు।

ఇన్ని కొంపలులేకపోతే ను వ్వు ఛస్తావా? చావవు। కాబట్టి సోదరా .... మనిద్దరం మనుష్యులం। అన్నదమ్ము

ల్లాంటివాళ్ళం। ఇచ్చెయ్। నాలాంటి దరిద్ర నారాయణులకు నీ ఇళ్ళన్నీ రిపేరు చేయించి ఇచ్చెయ్। ఇంకో సంగతి....నువు ఎవరికైనా అప్పున్నావా? నువ్వుండవని నాకు తెలుసు. ఉంటే వాళ్ళకి నా మాటగా ఈ మాటలన్నీ చెప్పెయ్।''

"రంగారావూ..ఉదయం మాట్లాడదాం నువు లోపలికెళ్లు"

"ఏం? నేనేమైనా తాగాననుకున్నావా? లేదు... సరే ... ఉదయమే మాట్లాడుదాం। కానీ ... ఉదయంకూడా ఇదేనా సమాధానం। అరిగిపోయిన గ్రాంఫోను రికార్డు వినలేదా నువ్వు। "గగనానికి ఇలకూ.. బహాదూరం బనినాదో. ..నాదో...నాదో... నా... దో దో..

గుమ్మంప్రక్క చిరిగిన చొక్కాల్లో, బిక్క మొహంవేసుకుని చూస్తున్న ఇద్దరు పిల్లల్నీ ఒక్క ఉదుటున అందుకుని గిరగిర తిరుగుతూ ఇంట్లోకి అడుగు పెట్టాడు రంగారావు।

"హహ్హ....మీకేం తెచ్చానో చెప్పుకోండి....ఇదుగో....ఏయ్.... రాణీ .... వీళ్ళిద్దరికీ ఇవి తొడిగెయ్ .... ఇదుగో నీకే....ఇపుడే తొడుగు।"

రంగారావు భార్య తేరుకునేసరికి చాలా సమయంపట్టింది। రంగారావు భోజనం చేస్తూ, ఆప్యాయంగా పిల్లల్ని తడుముతున్నపుడు నెమ్మదిగా, హీనస్వరంతో అడిగింది.

"మాకేమయినా ప్రమోషనొచ్చిందా?

"అదీ అలా అడిగావు బాగుంది। చాలా పెద్ద ప్రమోషనొచ్చింది। ఇంక మనకేం భయంలేదు.... కానీ, పిల్లలు మాత్రం జాగ్రత్తసుమా। ఇంతకాలం వేరు.... ఇకముందు మనకేం కష్టాలుండడానికి వీల్లేదు। కమాన్। ఈ మల్లెలన్నీ పెట్టుకో।

రంగారావు భార్య ఇంటివెనక దొడ్లో మంచంవేసింది। రంగారావు సిగరెట్టు కాలుస్తూ, మంచంమీద పడుకుని పైన పరుగెడుతున్న చంద్రుణ్ణి చూస్తున్నాడు। కూనిరాగం తీస్తున్నాడు, "చందమామ రావే .. జాబిల్లి రావే.....

కొంచెంసేపాగి. రంగారావు కూనిరాగం ఆపుచేసి, మంచంమీద కూర్చుని సన్నగా దగ్గుతున్న భార్యని పిలిచాడు, "రావోయ్ రాణీ .... రా .... ఇలా నా ప్రక్కన కూర్చో। నువ్వెందుకలా భయపడుతున్నావో నాకర్థం కాదు - ఇవ్వాల్టినుండి మనం దేనికీ భయపడాల్సిన పన్లేదు . నో.... పిల్లలు పడుకున్నారా। పడుకోకపోతే చెప్పెయ్.... జోలపాడదాం....వాళ్ళకంటే మనకింకెవరున్నారు చెప్పు"?

ఆలోచించీ..ఆలోచించీ.. మాట్లాడీ.. మాట్లాడీ... అలిసిపోయిన రంగారావు నిద్రలోకి ఎప్పుడు జారుకున్నాడో తెలీదు. బిక్కమొహం వేసి రంగారావు కేసి చూస్తున్న భార్య కళ్ళు మంటలు మండి ఎపుడో నిద్రపోయింది.చంద్రుడునవ్వులు వెదజల్లుతూ ఆకాశంలో కదులు తున్నాడు.

* * *

ఆఫీసులో అందరికీ రంగారావుకాఫీలు త్రాగించాడు- కాఫీ కొంచెం ఆలస్యంగా తెచ్చినందుకు ప్యూను మీదికి ఫైలోటి విసిరేశాడు।

ప్రక్కసీట్లో గుర్నాధం ఏదో జోకు వేస్తే రంగారావు పొలమారేటట్లు నవ్వాడు. అంతటితో ఆగక, "భలే..భలే" అని చిన్న పిల్లాడిలా గుర్నాధం వీపు చరిచి కితకితలు పెట్టాడు! పైపిస్టు సరోజను అర్థగంటసేపు సానుభూతిగా పరిశీలించి అడగని సలహాలిచ్చాడు!

అదుగో –

అపుడు ప్యూను బితుకుబితుకు మంటూ వచ్చి రంగారావుకో వార్త చెప్పాడు!

"సార్.... మీ కోసం బయట ఎవరో వచ్చారు!

"ఎవరూ ?"

ఏమోసార్—నాకేటి తెల్సు!

"వస్తున్నాం!" రంగారావు ఠీవిగా లేచి ఆఫీసు బయటకు నడిచాడు. అపుడు ఎండ బాగా తగ్గింది. ఆహ్లాదకరమైన గాలి ఆఫీసు చుట్టూ ఉన్న పచ్చ గన్నేరు మొక్కల మీది పూల నుండి వీస్తుంది. పైన ఆకాశంలో తెల్లటి దూది పింజల్లాంటి మబ్బులు సరసాలాడుకుంటున్నాయి! అక్కడ ఆఫీసు బయట సైకిలు కానుకుని "డా॥ క్రిష్ణమూర్తి పాథాలజీ" కాంపౌండరు నుంచున్నాడు. రంగారావును చూసీచూడగానే కాంపౌండరు గుర్రంలా సకిలించాడు.

"ఏమిటోయ్ ? అంతా కులాసా ?''
రంగారావు ఖిలాసాగా ప్రశ్నించాడు!

"నా సంగతేముంది గాని సార్ మీకు అర్జంటుగా క్షమార్పణలు చెప్పుకోవడానికి ఈ డొక్కు సైకిలుమీద యమ తిరిగాను.

"వార్నీ.... ఎందుకోయ్? ఏమిటి విశేషం?"

"మీరింకా ఇలా నవ్వుతూ ఉండడమే విశేషం. నిన్న మీ రక్త పరీక్షలో వేల స్థానంలో ఒక అంకె పైపు మిస్టేకు వలన పడలేదు.

"అంటే?"

"మీరు గొప్ప అదృష్టవంతులుసార్ మీకు లుకేమియా లేదు .... పాడులేదు మీరు సబ్బరంగా ఇంకో వంద ఏళ్ళ బ్రతుకుతారని డాక్టరుగారు చెప్పారు. అలా చూస్తారేం సార్,. ఈ చిన్న పొరపాటు జరిగినందుకు మీరు మమ్మల్ని అర్జంటుగా క్షమించెయ్యాలి.. డాక్టరయితే మటుకు దేవుడా సార్ ? మానవులకు పొరపాట్లు సహజమేగదా ? ఏమంటారు ?!"

రంగారావు ఏమంటాడు ? ఏమని ఉంటాడు, ఆ చల్లని సాయంత్రం అహ్లాదకరమైన వాతావరణంలో రంగారావు ఏం మాట్లాడాడో ఆ కాంపౌండరుకే తెలియాలి.

అయితే ఒక విషయం "

ఆ దినం సాయంత్రం ఎప్పటిలా తన నూటొక్క సమస్యల్ని భుజానేసుకుని, కిరాణం కొట్టు మల్లేశానికి క్షమార్పణలతో కొంతడబ్బు చెల్లించి పిలవకుండానే ఇంటి యజమాని గోపాలరావు దర్శనం చేసుకుని గెడ్డం పుచ్చుకుని. బ్రతిమిలాడుతాడు! దగ్గుతున్న, బక్కచిక్కిన తన పెళ్ళాంవంక.... ఇంట్లో అమాయకంగా ఆడుకుంటున్న రెండు కూనలవంక కసిగా చూస్తాడు. మంచం మీద ఆకలి కడుపుతో పడుకుని, పైన వెలుగుతున్న చందమామని చూసి.... "చందమామ రావే" అని కూనిరాగం తీయకుండా, తనని తాను తిట్టుకుంటూ కలత నిద్ర పోతాడు.

అదీసార్! అసలు సంగతి!